క్లుప్తంగా

లక్ష్మీనృసింహస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన లక్ష్మీనృసింహస్వామి

సీతానగరం: స్థానిక సువర్ణముఖి నది ఒడ్డున వేంచేసిన వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో వెలసిన శ్రీలక్ష్మీనృసింహస్వామికి భక్తులు గురువారం ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకాలు, తులసి దళాలతో తయారుచేసిన మాలలు వేసి పూజలు గావించారు. ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

కేన్సర్‌పై అవగాహన ర్యాలీ



కేన్సర్ అవగాహన ర్యాలీ

సీతానగరం: మండల కేంద్రంలో గురువారం కేన్సర్‌పై అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారిణి డాక్టర్ పావని ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. పొగాకు ఆధారిత ఉత్పత్తుల వల్ల కేన్సర్ సంక్రమిస్తుందన్నారు. సీహెచ్‌ఓ ఎస్‌వీ రమణ ఆధ్వర్యంలో వైద్యాధికారులు, సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. బగ్గందొరవలసలో పీహెచ్‌ఎస్ సత్యవతి ఆధ్వర్యంలో హెల్త్ అసిస్టెంట్ ఐ.హరికృష్ణ, ఏఎన్‌ఎం, సిబ్బంది ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్ హెచ్‌పీలు, హెల్త్ అసిస్టెంట్లు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

మక్కువ: మక్కువ మండలం ములక్కాయవలస మోడల్ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి అండర్ 14, 19 పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల విజయనగరం, కర్నూల్‌లో జరిగిన జిల్లా స్థాయి పోటీలలో పాఠశాలకు చెందిన 18 మంది విద్యార్థులు పాల్గొని, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రత్నకుమారి, పీడీ మోహన్‌రావు తెలిపారు. అండర్ 14, 19 రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు గురువారం ప్రిన్సిపాల్ రత్నకుమారి, పాఠశాల చైర్మన్ శిస్టు భారతి, ఉపాధ్యాయులు అభినందించారు.

వాహన తనిఖీలు



డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్న పోలీసులు

మక్కువ: మక్కువ, దుగ్గేరు, శంబర రహదారుల కూడలి వద్ద గురువారం ఏఎస్‌ఐ ఎం.శ్రీనివాసరావు, సిబ్బంది వాహన తనిఖీలు నిర్వహించారు. ఆయా రహదారులు గూండా ప్రయాణిస్తున్న వాహనదారులను నిలుపుదల చేసి, డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులకు అవగాహన కల్పించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తీసుకోవాల్సి వస్తుందని వాహనదారులకు హెచ్చరించారు. ప్రతి ఒక్క వాహనదారుడు హెల్మెట్ ధరించాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని వివరించారు.

బాలికల వసతిగృహాన్ని సందర్శించిన డీఎం



వసతిగృహంలో విద్యార్థినిలతో సహపంక్తి భోజనం చేస్తున్న ప్రత్యేక అధికారి విమల

సీతానగరం: మండలంలో నిర్వహించిన పల్లె నిద్ర కార్యక్రమంలో భాగంగా గురువారం రాత్రి మరిపివలస బాలికల వసతిగృహాన్ని మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజరు(ప్రత్యేక అధికారి) వై.విమల సందర్శించారు. వసతిగృహంలో కల్పిస్తున్న వసతులు, విద్యార్థులకు పెడుతున్న భోజన సౌకర్యాలను విద్యార్థినిలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థినిలతో సహపంక్తి భోజనం చేసారు. కార్యక్రమంలో ఎంఈఓ జి. సూరిదేముడు పాల్గొన్నారు.

- రబీ పంటలకు ప్రీమియం సాగుదారులే చెల్లించాలని ఉత్తర్వులు
- నియోజకవర్గంలో 16,022 లక్షల ఎకరాల్లో రబీ సాగు
- డిసెంబర్ 15లోపు ప్రీమియం చెల్లించాల్సిందే..
- ప్రభుత్వ నిర్ణయంపై అన్నదాత ఆవేదన



పార్వతీపురం మండలంలో వరి సాగు

ఉచిత పంటల.. బీమా పథకానికి చెక్!

పార్వతీపురం టౌన్:

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రైతుల నడ్డి విరుస్తోంది. ఇప్పటి వరకు పంట పెట్టుబడి సాయం అందించకపోగా తాజాగా ఉచిత పంటల బీమా పథకాన్ని ఎత్తివేసి ఆ భారం రైతులపైనే వేసింది. దీంతో కూటమి ప్రభుత్వ పాలనలో తమకు అప్పులు తప్ప ఆదాయం లేదని కర్షకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత రబీ సీజన్‌లో పార్వతీపురం నియోజకవర్గంలో 3 మండలాల పరిధిలో 16,022 ఎకరాల్లో వరి, కంది, మినుము, మొక్కజొన్న తదితర పంటలు వేయాల్సి ఉంది. అయితే, ఆయా పంటలకు రైతులే బీమా ప్రీమియం చెల్లించాలని కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

నాడు అడుగడుగునా సాయం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్దపీట వేసి రైతులకు అడుగడుగునా సాయం అందించి ఆదుకుంది. గడిచిన ఐదేళ్ల కాలంలో ప్రతి ఏటా రూ.13,500 పెట్టుబడి సాయం, గ్రామ సచివాలయాలకు అనుబంధంగా రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి నాణ్యమైన విత్తనాలు, కల్తీ లేని రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు సరఫరా చేసింది. ప్రభుత్వమే ఆయా పంటలకు ఉచితంగా బీమా చెల్లించి అతివృష్టి, అనావృష్టి కారణంగా పంట నష్టం సంభవిస్తే ఆయా సీజన్లలోనే పంట నష్టపరిహారం చెల్లించింది. వివిధ పంటల్లో రైతులు అధిక దిగుబడులు సాధించేందుకు వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చింది. విత్తనాలు, రసాయన ఎరువుల నాణ్యతను పరిశీలించుకునేందుకు ప్రతి నియోజకవర్గ కేంద్రంలో అగ్రిలేబ్‌లు ఏర్పాటు చేసి అన్నదాతకు అండగా నిలిచింది. ఐదు నెలల క్రితం అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన బాబు సర్కారు రైతు సంక్షేమాన్ని గాలికి వదిలేసింది.

నియోజకవర్గంలో మండలాల వారీగా రబీ సాగు..	
మండలం	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో..)
పార్వతీపురం	7,800
సీతానగరం	1,022
బలిజిపేట	7,200

డిసెంబర్ 15లోగా ప్రీమియం చెల్లించాలి

ప్రభుత్వ ఆదేశాల మేరకు వరి ఎకరా పంటకు రూ.84, మొక్కజొన్న ఎకరానికి రూ.72, పెసర పంట ఎకరాకు రూ.40, జీడిమామిడి ఎకరాకు రూ.1600 చొప్పున డిసెంబర్ 15లోపు బీమా ప్రీమియం చెల్లించాలి. రబీలో వర్షాభావ పరిస్థితుల కారణంగా ఎక్కువశాతం పంట నష్టం సంభవిస్తుంది. ఇలాంటి సమయంలో ఈ పంట నమోదు ఆధారంగానే పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ వర్తిస్తుంది. ఈ ఏడాది ఖరీఫ్ పంటలకు ప్రీమియం చెల్లిస్తామని, రబీ పంటలకు రైతులే ప్రీమియం కట్టుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో రైతులు దిగాలు చెందుతున్నారు.

ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి..

ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి. గతంలో రెండు సీజన్లలో రైతులకు ఉచిత పంటల బీమా వర్తింపజేసేవారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఖరీఫ్ పంటలకే ఉచిత పంటల బీమా వర్తింపజేసి రబీ పంటల బీమా భారం రైతులపై వేస్తున్నారు. ఈ పంటలకు కూడా ఉచిత పంటల బీమా వర్తింపజేసి ఆదుకోవాలని కోరుతున్నాం.

– వంగపండు విశ్వేశ్వరరావు, రైతు పార్వతీపురం

రబీ పంటలకు ఉచిత బీమా వర్తింపజేయాలి

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించి ఉచిత పంటల బీమా వర్తింపజేసింది. ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి పంట నష్టం సంభవిస్తే నష్టపరిహారం అందించి ఆదుకుంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పంటల బీమాకు సంబంధించి ప్రీమియం మొత్తాన్ని రైతులే చెల్లించాలని ఉత్తర్వులు జారీ చేయడం విచారకరం.

– ముప్పల అప్పలనాయుడు, రైతు, బాలగుడబ గ్రామం

పరిశీలన..



సాలూరు పట్టణంలోని గిరిజన బాలుర, బాలికల వసతిగృహాలను సీపీఎం సభ్యులు గురువారం పరిశీలించారు. ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎన్‌వై నాయుడు ఆధ్వర్యంలో ఇందు, విజయ్, శంకర్ తదితరులు పరిశీలన చేశారు. అనారోగ్యాలతో గిరిజన విద్యార్థులు మరణిస్తున్నా.. గిరిజన సంక్షేమ శాఖ స్పందించకపోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల మరణాలపై ప్రభుత్వం కమిటీ వేసి నిజాలు వెలికితీయాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన గిరిజన విద్యార్థుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వసతిగృహాల్లో మౌలిక వసతులు కల్పించాని, ఏఎన్‌ఎంలను తక్షణమే నియమించాలని కోరారు. – సాలూరు

మౌలిక వసతులపై ఆరా..



జోగింపేటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో విద్యార్థుల మౌలిక సదుపాయాలపై జిల్లా ఉద్యానవన శాఖ డీడీ, మండల ప్రత్యేకాధికారి కేఏస్ వరప్రసాద్ ఆరా తీశారు. పల్లె నిద్రలో భాగంగా ఆయన గురువారం రాత్రి విద్యాలయాన్ని సందర్శించారు. ఆయనతో పాటు ప్రిన్సిపాల్ మధుబాబు, ఈశ్వరరావు ఉన్నారు. – సీతానగరం

బ్యాంక్ అకౌంట్‌కు ఆధార్ జత చేయాలి

- పోస్టల్ సూపరింటెండెంట్ బాబూరావు



పార్వతీపురం టౌన్:

ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు లబ్ధిదారుల అకౌంట్‌లో నేరుగా పడాలంటే బ్యాంక్ అకౌంట్ నెంబర్‌కు ఆధార్ నెంబర్ జత చేసుకోవాలని పోస్టల్ సూపరింటెండెంట్ రెడ్డి బాబూరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేసారు. రాష్ట్రంలో 62 లక్షల బ్యాంక్ ఖాతాలు ఉన్నాయని, రాబోయే రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా వచ్చే నగదు అకౌంట్ పొందడానికి బ్యాంక్ అకౌంట్‌కి ఆధార్ జతపరచడం తప్పనిసరన్నారు. రాష్ట్ర ప్రభుత్వ లెక్కల ప్రకారం సుమారు 65 లక్షల మంది ఎన్‌పీసీఏ ద్వారా జిల్లా పరిధిలో దాదాపు 1.20 లక్షల బ్యాంక్ అకౌంట్స్ ఆధార్ లింక్, ఎన్‌పీసీఎల్ లింక్ కానిది ఉన్నాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం సూచనల మేరకు, ప్రతీ ప్రాంతీయ సచివాలయ పరిధిలో గల పోస్టాఫీసు ద్వారా ఐపీపీబీ (ఇండియన్ పోస్టు పేమెంట్ బ్యాంక్) ఆధార్ సీడింగ్, ఏన్‌పీసీఎల్ లింక్ చేసుకోవాలని సూచించారు. పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలో ఉన్న అన్ని ప్రధాన పోస్టాఫీసులు, సబ్ పోస్టాఫీసులు, బ్రాంచ్ పోస్టాఫీసులు కలిసి 445 పోస్టాఫీసుల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. లబ్ధిదారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆ ప్రకటనలో కోరారు.

గిరిజన విద్యార్థుల మృతిపై సమగ్ర విచారణకు డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి

పార్వతీపురం టౌన్: గిరిజన విద్యార్థుల మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బి.రవికుమార్ డిమాండ్ చేసారు. ఈ మేరకు గురువారం పట్టణంలో సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సుమారుగా 55 వరకు ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయన్నారు. రెండు ఐటీడీఏలకు పూర్తి స్థాయిలో సిబ్బంది ఉండకపోవడం వలన పర్యవేక్షణ కొరవడిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల కొరత, సరిపడ నిధులు మంజూరు కాకపోవడం, అధికారులు పూర్తి స్థాయిలో పర్యవేక్షణ లేకపోవడంతోనే ఇలాంటి సంఘటనలు పునరావృతం అవుతున్నాయని తెలిపారు. దీనికి పూర్తి బాధ్యత ప్రభుత్వమే వహించాలని డిమాండ్ చేశారు. మన్యంలో జరుగుతున్న గిరిజన విద్యార్థుల మరణాలకు రాష్ట్ర ప్రభుత్వం, గిరిజన శాఖ మంత్రి బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విద్యా సంవత్సరంలోనే సుమారుగా ఇప్పటి వరకు ఏడుగురు విద్యార్థులు మృతి చెందడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. మృతి చెందిన గిరిజన విద్యార్థుల కుటుంబాలకు రూ.15 లక్షల చొప్పున నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

నిరుపేద కుటుంబానికి అండగా 'మీకై మేము..'



మీకై మేము సభ్యులకు కృతజ్ఞతలు తెలుపుతున్న సంగమ్మ

పాచిపెంట: మండల కేంద్రంలో బీసీ కాలనీ సమీపంలో ఎరుకుల వీధికి చెందిన నిరుపేద గొర్లె సంగమ్మకు మీకై మేము బృందం సభ్యులు ఆశ్రయ కల్పన సాయం చేసారు. ఒంటరిగా జీవిస్తున్న సంగమ్మకు సొంత ఇల్లు లేదు. సిమెంట్ ఇటుకలతో ఓ చిన్న గదిని నిర్మించుకున్నప్పటికి ఆర్థిక స్థోమత లేక రేకులు వేసుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతుంది. వర్షాలు పడితే ఆమె పక్కింట్లో తలదాచుకోగా, ఆమె నిత్యావసర సరుకులు వర్షానికి తడిచి పోయేవి. విషయం తెలుసుకున్న మీకై మేము సభ్యులు దాతల సహాయంతో ఆమెకు సుమారు రూ.14 వేల విలువ చేసే రేకులను అందించారు. కార్యక్రమంలో సభ్యులు దిలీప్‌కుమార్, నరేష్, రాజు, మహేష్, గణపతి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన



ఆరోగ్య శాఖ, పోలీసు సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఐఆర్‌ఏడీ మేనేజర్ శ్రీధర్

పార్వతీపురం టౌన్: రోడ్డు ప్రమాదాల నివారణకు రూపొందించిన ఐఆర్‌ఏడీపై సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని ఐఆర్‌ఏడీ మేనేజర్ ఎం.శ్రీధర్ ఆధ్వర్యంలో జిల్లా ఆస్పత్రిలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐఆర్‌ఏడీ, రవాణా శాఖ ఆధ్వర్యంలో 50 మంది ఆరోగ్య శాఖ, పోలీస్ శాఖ సిబ్బందికి రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధించిన నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్ రూపొందించిన ఐఆర్‌ఏడీపై పూర్తి అవగాహన కల్పించామన్నారు. రోడ్డు ప్రమాదాల కారణాలను విశ్లేషించడం, ప్రమాదాలను తగ్గించడానికి భద్రతా చర్యలు రూపొందించడంలో సహాయపడే సెంట్రల్ యాక్సిడెంట్ డేటాబేస్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను మద్రాస్ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అభివృద్ధి చేసిందన్నారు. నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్(ఎన్‌ఐసీ)ద్వారా అమలు చేయడం జరుగుతోందని తెలిపారు. ఐఆర్‌ఏడీ మొబైల్ అప్లికేషన్ ఫొటోలు, వీడియోలతో పాటు రోడ్డు ప్రమాదాల వివరాలను నమోదు చేయడానికి పోలీసు సిబ్బందికి సహాయకారిగా ఉంటుందని, వాటిపై పూర్తి పరిజ్ఞానం పెంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.వాగ్దేవి, రవాణా శాఖ మెడికల్ ఆఫీసర్ డా.పి.నారాయణరావు, రీజనల్ మెడికల్ అధికారి శేషగిరి, జిల్లా పోలీస్ సిబ్బంది, ఆస్పత్రుల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

104 ఉద్యోగుల వేతనాలు చెల్లించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న 104 యూనియన్ నాయకులు

సీతానగరం: గ్రామీణ ప్రాంతాల్లో నిరంతరం వైద్య సేవలందించడానికి ప్రాణాలను ఫణంగా పెట్టి విధులు నిర్వహిస్తున్న 104 సిబ్బందికి తక్షణమే వేతనాలు చెల్లించాలని ఆ ఉద్యోగులు ప్రభుత్వాన్ని కోరారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వారు తహసీల్దార్ ఉమామహేశ్వరరావుకు గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ అధికారుల ఆదేశాలతోనే తాము నిరంతరం విధులు నిర్వహిస్తున్నామని తెలిపారు. కరోనా కష్ట కాలంలో ప్రాణాలకు తెగించి విధులు నిర్వహించామన్నారు. జీతాలు సకాలంలో అందకపోవడం వల్ల కుటుంబపరంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. తమ సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఆ సంఘం ప్రధాన కార్యదర్శి సీహెచ్ ప్రసాదరావు, ఈశ్వరరావు తదితరులు ఉన్నారు.

శిక్షణను తక్షణమే రద్దు చేయాలి

- ఏపీటీఎఫ్ డిమాండ్

పార్వతీపురం టౌన్:

స్కూల్ లీడర్‌షిప్, ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణ కార్యక్రమాలు తక్షణమే రద్దు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మహేష్, బాలకృష్ణ గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. ఎన్‌టీఆర్ జిల్లా ఆరిగిపల్లిలో జరుగుతున్న లీడర్‌షిప్ ట్రైనింగ్‌లో ఓ ప్రధానోపాధ్యాయుడు తోట వెంకటరత్నకుమార్ గుండెపోటుతో మరణించడం బాధాకరమన్నారు. ఉపాధ్యాయ సంఘాలు మొత్తుకుంటున్నా విద్యా శాఖ ఉన్నతాధికారులకు చీమకుట్టినట్లైనా లేదని, ఇటువంటి బలవంతపు శిక్షణల వల్ల ఎంతమంది ఉపాధ్యాయుల ప్రాణాలు బలి తీసుకుంటారని ప్రశ్నించారు. ఉపాధ్యాయుడి మరణానికి విద్యాశాఖ ఉన్నతాధికారులే పూర్తి బాధ్యత వహించాలని, మరణించిన ఉపాధ్యాయుడి కుటుంబానికి రూ.50 లక్షల నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. గత సంవత్సరం లీడర్‌షిప్ శిక్షణా కార్యక్రమాలు జరిగాయని, ప్రస్తుతం అందరూ ప్రధానోపాధ్యాయులు అపార్ నమోదు, పదవ తరగతి పరీక్షల నామినల్ రోల్స్ ఫీజు చెల్లింపు మొదలైన కార్యక్రమాలలో తలమునకలై ఉన్నారని పేర్కొన్నారు. రెసిడెన్షియల్ పద్ధతిలో ఆరు రోజుల పాటు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం వల్ల, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ఉపాధ్యాయులు, వయోవృద్ధులు ,బాలింతరాళ్లు తీవ్రమైన ఇబ్బందులతో పాటు మానసిక క్షోభను భరిస్తున్నారన్నారు. శిక్షణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోనట్లయితే భవిష్యత్తులో జరిగే తీవ్రమైన పోరాటాలకు బాధ్యత వహించవలసి ఉంటుందని వారు హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొమరాడ: మండలంలోని శివిని ఫీడర్‌కు సంబంధించిన విక్రాంపురం, చంద్రంపేట, పరుశురాంపురం, మార్కొండపుట్టి తదితర గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని సంబంధిత శాఖ ఏఈ గొర్లి వెంకటరమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ వైర్లకు తగిలి ఉన్న చెట్లు కొమ్మలను నరికి వేయడంతో పాటు చిన్న చిన్న మరమ్మతులను పరిష్కరించి విద్యుత్ సరఫరా చేస్తామని చెప్పారు.

ఆర్టీసీ డిపోలో డ్రైవర్ల హ్యాపీ వీక్



డ్రైవర్ల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న డీఎం కనకదుర్గ

పార్వతీపురం టౌన్: ఆర్టీసీ డిపోలో డ్రైవర్ల హ్యాపీ వీక్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ కనకదుర్గ తెలిపారు. ఈ మేరకు గురువారం డిపోలోని డ్రైవర్ల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒకటి నుంచి మూడో తేదీ వరకు డ్రైవర్ నుంచి వివిధ రకాలైన అర్జీలను స్వీకరించామన్నారు. 4, 5, 6 తేదీలలో బస్సుల మరమ్మతుల అటెండ్ చేసినట్లు తెలిపారు. డ్రైవర్‌లు ఆనందించడమే కాకుండా రెట్టింపు ఉత్సాహంతో పని చేయాలన్నారు. డ్రైవర్లు నుంచి అర్జీలను వెంటనే పరిష్కరిస్తామన్నారు. ప్రతి నెల ఒకటి నుంచి 7వ తేదీ వరకు డ్రైవర్లు హ్యాపీ వీక్ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు డ్రైవర్లు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాల పరిశీలన



పణుకుపేటలో పంటకోత ప్రయోగంలో పాల్గొన్న అధికారులు

సీతానగరం: పీఎం ఫసల్‌బీమా యోజన పథకంలో భాగంగా మండలంలో వరి పంటలో 128 కోత ప్రయోగాలు నిర్వహిస్తున్నామని ఏఓ ఎస్.అవినాష్ సహాయ గణాంకాధికారి సతీష్ తెలిపారు. ఏఎస్ఓ సతీష్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిర్వహిస్తున్న పంటకోత ప్రయోగాలను ఏఓ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంటలో 32 ఇన్సురెన్స్ యూనిట్లలో 128 పంట కోత ప్రయోగాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 34 పంట కోత ప్రయోగాలు చేశామన్నారు. పణుకుపేటలో క్షేత్ర స్థాయిలో పంట కోత ప్రయోగం చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీ కార్యాలయ అధికారి జయప్రకాష్, క్షేత్ర స్థాయి అధికార సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహనతో కేన్సర్‌ను జయించొచ్చు...

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.విజయపార్వతి



ర్యాలీని ప్రారంభించిన డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.విజయపార్వతి

పార్వతీపురం టౌన్: అవగాహన కలిగి ఉండి, ముందస్తు పరీక్షలతో కేన్సర్ ప్రబలకుండా జాగ్రత పడవచ్చని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ కె.విజయపార్వతి అన్నారు. కేన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా ఆరోగ్య కార్యాలయ ప్రాంగణంలో గురువారం అవగాహన కార్యక్రమం చేపట్టారు. అంతకు ముందు కేన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్‌సీడీ 3.0 సర్వేలో భాగంగా కేన్సర్ స్క్రీనింగ్‌ను జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నామన్నారు. ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు అన్ని ప్రాథమిక, గ్రామీణ ఆరోగ్య కేంద్రాల పరిధిల్లో గురువారం క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. 18 సంవత్సరాలు పైబడిన వారికి ఇంటి వద్దనే స్క్రీనింగ్, పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా నోటి కేన్సర్, రొమ్ము కేన్సర్, గర్భాశయ ముఖద్వార కేన్సర్ ప్రభావితం కాకుండా ముందస్తు పరీక్షలు అవసరమన్నారు. ఇందుకుగాను ఎన్‌సీడీ సర్వే ఫార్మేట్‌లో ఇవ్వబడిన ప్రశ్నావళిని గృహ సందర్శనలో అడగడం జరుగుతుందన్నారు. వైద్య సిబ్బంది సర్వే పక్కాగా నిర్వహిస్తూ వివరాలు మొబైల్ అప్లికేషన్‌లో నమోదు చేయాలన్నారు. అనంతరం ఆశా నోడల్ అధికారుల సమావేశం నిర్వహించి పలు ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష జరిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు, డా.రఘుకుమార్, డా.వినోద్‌కుమార్, డెమో యోగీశ్వరరెడ్డి, డీపీహెచ్‌ఎన్ ఉషారాణి, డీపీఓ లీలారాణి, ఎస్ఓ శంకర్, డీసీఎం విజయలత, వైద్య సిబ్బంది, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.